## క్లుప్తంగా

### ఆశా వర్కర్ల కమిటీ ఎన్నిక

చింతపల్లి : చింతపల్లి మండల ఆశా వర్కర్ల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా తిరుగుళ్ల పుష్పలత, ఉపాధ్యక్షులుగా ఎస్.పద్మ, డి.లావణ్య, ప్రధాన కార్యదర్శిగా జి.విమల, సహాయ కార్యదర్శిగా జబ్బు పార్వతి, నవ్య, కోశాధికారిగా కట్ట విజయలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### ప్రభుత్వ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ బహూకరిస్తున్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-1997 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు రూ.25వేల విలువ గల ప్రింటర్‌ను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోరిక మేరకు ప్రింటర్‌ను అందజేసినట్లు తెలిపారు. చదువుకున్న పాఠశాలకు ఆర్థిక సాయం అందజేసిన పూర్వ విద్యార్థులను గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, పజ్జూరి రమేష్, బచ్చు రంగయ్య, అంబటి వెంకన్న, రాజబాబు, రమేష్ కుమార్, అంబటి సైదులు, రమేష్ పాల్గొన్నారు.

### రేపు ఉపాధి హామీ ఓపెన్ ఫోరం

మిర్యాలగూడ : మండలంలోని ఆయా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈనెల 29న ఓపెన్ ఫోరంను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 46 గ్రామాల్లో మార్చి 1, 2022 నుంచి మార్చి 31, 2023 వరకు నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఓపెన్ ఫోరాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నారని, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

### బీమా చెక్కు అందజేత



కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : మండలంలోని చింతపల్లి గ్రామానికి చెందిన గంగుల స్వప్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. కాగా స్వప్నకు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో కుటుంబానికి మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన అందజేసి మాట్లాడారు. మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డి, దామరచర్ల జెడ్పీటీసీ లలితహాతీరాంనాయక్, సర్పంచ్ బానావత్ లలితసక్రునాయక్, నాయకులు ప్రకాశ్ నాయక్, భిక్షంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, షేక్ ఫయాజ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### బంజారా సంస్కృతిని కాపాడుకోవాలి

త్రిపురారం : బంజారా చరిత్ర, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని జెడ్పీటీసీ భారతీ అన్నారు. శనివారం మండలంలోని వస్త్రాంతండాలో తన నివాసంలో బంజారా ఉద్యోగుల సంఘం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ భారతీ మాట్లాడుతూ.. బంజారా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతో సంఘాలు కృషి చేసుకోవాలన్నారు. అనంతరం జెడ్పీటీసీకి బంజారా ఉద్యోగుల సంఘం సభ్యులు క్యాలెండర్, డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్, బాలు నాయక్, మంక్లా నాయక్, హర్యా నాయక్ పాల్గొన్నారు.

### మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం చెకుముకి మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రైవేట్ స్కూల్ విభాగంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్, ప్రభుత్వ విభాగంలో కొండమల్లేపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి టెస్ట్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం చెరుపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు నల్లా నరసింహ, సైన్స్ ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయక్, సముద్రాల శ్రీనయ్య, కలమ్మ, జనార్దన్‌రెడ్డి, సైదానాయక్, జగదీశ్, చంద్రయ్య, నీరజ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌పై నిషేధం అమలు ఏదీ?

- విచ్చలవిడిగా సింగిల్‌యూజ్ కవర్ల వినియోగం
- ర్యాంకుల కోసం అధికారుల ఆరాటం
- నిషేధం అమలుపై పట్టింపు కరువు



మిర్యాలగూడలో ఓ దుకాణంలోని కవర్లు

మిర్యాలగూడ టౌన్ : ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి హానికారం అంటున్న ప్రజలు మాత్రం ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గడం లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయి. కానీ మిర్యాలగూడ మున్సిపాలిటీలో మాత్రం ఆ నిషేధం అమలు మాత్రం కావడం లేదు. విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వాలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యావంతులు, పర్యావరణ ప్రేమికులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వాడకం మాత్రం తగ్గడం లేదు. సరైన నిఘా లేకపోవడం మొక్కుబడిగా తనిఖీలు, అడపదడప జరిమానాలు విధించకపోవడంతో పాలిథిన్ కవర్ల వాడకానికి అడ్డు అదుపులేకుండా పోయింది.

**బహిరంగ ప్రదేశాల్లోనే ప్లాస్టిక్ వ్యర్థాలు**

పాలిథిన్ కవర్లు వాడకంలో అనేక అనార్థాలున్నాయనే ఉద్దేశంతో ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధించింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చెత్త వాహనాలు ఇంటి వద్దకు పంపిస్తుంది. అయినప్పటికీ బహిరంగ ప్రదేశాలు, రోడ్లపక్కన ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ దర్శనం ఇస్తుంది. కూరగాయాలు, పండ్లు, సరుకులు ఇతర తినుబండారాలను విక్రయించే వ్యాపారులు యథేచ్ఛగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ప్లాస్టిక్ కవర్ల వలన కలిగే అనార్థాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. పాలిథిన్ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు, సంచులు, ప్లేట్లు తదితర వస్తువులు నిషేధం ఉన్నప్పటికీ విక్రయాలను సాగిస్తుండటంతో వాటిపై దృష్టిని సారించాల్సిన అవసరం మున్సిపల్ అధికారులకు ఎంతైనా ఉంది.

**నోటీసులు జారీ చేశాం**



ప్లాస్టిక్ నియంత్రణపై మున్సిపల్ ప్రత్యేక దృష్టిని సారించింది. ఇప్పటికే ప్లాస్టిక్ విక్రయదారులకు నోటీసులు కూడా జారీ చేశాం. తనిఖీలను కూడా చేపట్టడం జరుగుతుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు దొరికితే తప్పని సరిగా చర్యలను తీసుకుంటాం. వారం వారం మున్సిపల్ సిబ్బందితో ఎప్పటికప్పుడు ప్లాస్టిక్ షాపులను తనిఖీలు చేయిస్తున్నాం. అదే విధంగా జరిమానా కూడా విధిస్తున్నాం. పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు వార్డు వారీగా సదస్సులను నిర్వహించి చైతన్యం తీసుకవస్తాం.

– పూర్ణచందర్, మున్సిపల్, కమిషనర్, మిర్యాలగూడ

**తనిఖీలు నామమాత్రమే**

మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ అమ్మకందారులపై నామ మాత్రపు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో వ్యాపారాన్ని లెక్క చేయడం లేదు. స్వచ్ఛ సర్వేలో తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ కేవలం ర్యాంకుల కోసం ఆరాటపడుతున్నారు. కానీ కవర్ల వినియోగిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

# ఓటరుగా నమోదు చేసుకోవాలి



త్రిపురారం : సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ చెన్నయ్య

వేములపల్లి : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గాను డిగ్రీ పట్టా పొంది మూడేళ్లు పూర్తి చేసుకున్న గ్రాడ్యుయేట్లు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ చెన్నయ్య సూచించారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి మాట్లాడారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు నూతనంగా నమోదు కావాల్సి వారందరూ ఫారం-18 ద్వారా ఆన్‌లైన్ గాని ఆఫ్‌లైన్‌లో గాని దరఖాస్తు చేసుకోవాలన్నారు. పట్టభద్రులు తమ పట్టా సర్టిఫికెట్ జీరాక్స్ ప్రతులను అటెస్టెడ్ చేయించుకోని స్వయంగా సంబంధిత ఫారాలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ ఫిబ్రవరి 6 వరకు ఉన్నందున పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలో ఖాళీగా ఉన్న రావులపెంట, తిమ్మారెడ్డిగూడెం రేషన్ దుకాణాలకు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేసి డీలర్లను నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివా స్‌శర్మ, డీటీ నిర్మలాదేవి, సీనియర్ అసిస్టెంట్ ఫాతిమాజహేరా, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన ఉన్నారు.

త్రిపురారం : గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా వేగవంతం చేయాలని మిర్యాలగూడ ఆర్డీఓ బి. చెన్నయ్య రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చెన్నయ్య మాట్లాడుతూ గ్రామల్లో భూములకు సంబంధించి ఉన్న సమస్యలు పరిష్కారానికి సమయం కేటాయించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యాలయంలో సిబ్బంది సమయ పాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంజనపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని పాల్తీతండాకు చెందిన కొందరు రైతులు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గాజుల ప్రమీలా, డిప్యూటీ తహసీల్దార్ సైదులు, ఆర్ఐలు సైదులు, ఝాన్సీ, జూనియర్ అసిస్టెంట్ నర్సింహ, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుడు గంగాధర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సైనికుడు తిరునగరు గంగాధర్ 4వ వర్ధంతిని శనివారం పట్టణ కేంద్రంలో నిర్వహించారు. రాజీవ్‌చౌక్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు తిప్పన విజయసింహారెడ్డి, స్కైలాబ్‌నాయక్, మెరుగు రోశయ్య, మోసిన్‌అలీ, మగ్దుంపాషా తదితరులు ఉన్నారు. అదేవిధంగా రాజీవ్‌భవన్‌లో నిర్వహించిన గంగాధర్ 4వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాయం ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామలింగయ్యయాదవ్, ఇమ్రాన్, ఇనయత్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

## సమాజ సేవలో వాసవీ, వనితా క్లబ్‌లు ముందుండాలి



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : సమాజ సేవలో వాసవీ, వనితా క్లబ్‌లు ముందుండాలని ఆ క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బుక్కా శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని విఘ్నేశ్వర ఫంక్షన్‌హాల్‌లో వాసవి క్లబ్ వనిత, వాసవి క్లబ్ వనిత కుసుమాంబ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ సీనియర్ మహిళా నేత, సిల్వర్ సీకేజీఎఫ్ డిస్ట్రిక్ ఇన్‌చార్జ్ పీఆర్ఓ రాయపూడి భవాని ఉమశేఖర్ దంపతుల ఆధ్వర్యంలో పట్టణంలోని తాళ్లగడ్డ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తులు, వృద్ధాశ్రమంలో సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు.అలాగే కొత్తగూడెంలోని దయానంద వృద్ధుల ఆశ్రమానికి 50కేజీల బియ్యాన్ని జయిని పద్మ, శ్రీనివాస్, కె. లావణ్య, క్రాంతిలు అందజేశారు. వాసవిక్లబ్ వనిత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు ఇందిర, తల్లం పుష్ప, కోశాధికారి పైయిడిమర్రి ఉషాబాల, వాసవి క్లబ్ వనతి కుసుమాంబ అధ్యక్ష, కార్యదర్శులు గుండా లక్ష్మి, వీరేవల్లి శ్రీదేవి, జైయిని సుష్మితలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, ఇంటర్నేషనల్ నాయకులు రాచర్ల కమలాకర్, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటీవ్ సభ్యులు తెడ్ల జవాహర్‌బాబు, తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, డైమాండ్ కేసీజీఎఫ్ డిస్ట్రిక్ క్యాబినేట్ సెక్రటరీ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పోస్టులో బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

మిర్యా లగూడ టౌన్ : త్వరలో భర్తీ చేసేనామినేటెడ్ పోస్టుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా బీసీలకు అధిక ప్రాధాన్యం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగగౌడ్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేల కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నామినేటెడ్ పోస్టుల్లో బీసీల ప్రాధాన్యం కల్పించాలని ఎమ్మెల్సీని కోరారు. ఈ విషయంపై సమగ్రంగా ఆలోచించి బీసీలకు న్యాయం చేసే విధంగా చూడాలని కోరారు.

## గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న చేపట్టనున్న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బైరం దయానంద్ అన్నారు. శనివారం దామరచర్ల మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మహేష్, కోటయ్య తదితరులు ఉన్నారు.

చింతపల్లి : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె , గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నల్లా వెంకటయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో సీఐటీయూ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాగరాజు, పుష్పలత, నవ్య, పద్మ, పాల్గొన్నారు.

### ‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయాలి

నల్లగొండటూటౌన్: ఎస్సీ వర్గీకరణ కోసం ఫిబ్రవరి 5, 6 తేదీల్లో చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి అన్నారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ వేసి పార్లమెంట్‌లో బిల్లు పెడతామని చెప్పిన బీజేపీ నాయకులు తమ వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాదిగ యూత్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు దున్న కొండల్, ఆదిమల్ల శంకర్, పెరిక ఉమా మహేశ్వర్, తీగల జాన్‌శాస్త్రి, గార్లపాటి శేఖర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### అందుబాటులో విత్తనాలు

మిర్యాలగూడ: నందిపాడులోని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలో వివిధ రకాల అపరాల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని సంస్థ రీజినల్ మేనేజర్ సీహెచ్.కృష్ణవేణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ కే6 విత్తనాలు 30కేజీల బ్యాగ్ రూ.2,865, శనగ విత్తనాలు 25కేజీలు రూ.1,875, మినుములు 4కేజీలు రూ.424లకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు.

### అనుముల వాసికి డాక్టరేట్

నల్లగొండటూటౌన్: అనుముల మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన ఆదిమల్ల బంగారయ్య భూగర్భ శాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. ఉస్మానియా యూనివర్సిటీ పీజీసెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి పర్యవేక్షణలో ‘హైడ్రో జియలాజికల్ అండ్ హైడ్రో జియో కెమికల్ ఇన్వెస్టిగేషన్స్’ అనే అంశంపై చేసిన పరిశోధనకు తనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

# టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీల ఎన్నిక





అడవిదేవులపల్లి : మాట్లాడుతున్న సత్యనారాయణ



భోజ్యానాయక్, దామరచర్ల అధ్యక్షుడు



సామ సైదులు, త్రిపురారం అధ్యక్షుడు



శంకర్ నాయక్, ప్రధాన కార్యదర్శి

మిర్యాలగూడ : దామరచర్ల మండల టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా తెజావత్ భోజ్యానాయక్ ఎన్నికయ్యారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ధనావత్ దాశివ, ఉపాధ్యక్షులుగా సయ్యద్‌పాషా, మట్టమ్మ, కోశాధికారిగా జ్ఞానేశ్వర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా నెహ్రూనాయక్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో చినవెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, జి.నాగమణి, శ్రీనివాసచారి, చంద్రశేఖర్, బైరం బాలరాజు, సుధీర్‌కుమార్, కోటయ్య, నరేష్, మోహన్ బాబు, జ్యోతి, శ్రీదేవి, లక్ష్మీ, అరుణ, నాగేశ్వరి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

**త్రిపురారం మండల అధ్యక్షుడిగా సైదులు**

త్రిపురారం : టీఎస్‌యూటీఎఫ్ త్రిపురారం మండల నూతన కమిటీని శనివారం మిర్యాలగూడలో టీచర్స్ భవన్‌లో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎస్‌యూటీఎఫ్ త్రిపురారం మండల అధ్యక్షుడిగా సామ సైదులు, ప్రధాన కార్యదర్శిగా ధీరావత్ శంకర్ నాయక్, ఉపాధ్యక్షులుగా కుంచం కమలమ్మ, ఏనుగు దశరథలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా సంఘం బాధ్యులు నాగమణి, బక్కా శ్రీనివాస్‌చారి, విజయ లక్ష్మీ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, హనుమా నాయక్ తధితరులు పాల్గొన్నారు.

**అడవిదేవులపల్లి అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యనారాయణ, శంకర్‌నాయక్**

అడవిదేవులపల్లి : టీఎస్‌యూటీఎఫ్ అడవిదేవుపల్లి మండల అధ్యక్షుడిగా పులి సత్యనారాయణ ఎన్నికయ్యారు. శనివారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చల్కపల్లి శ్యామ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా భగవాన్‌రెడ్డి, మునీశ్వరి, కోశాధికారిగా చంద్రశేఖర్, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా సతీష్‌లు ఎన్నికయ్యారు. సమావేశంలో జి.నాగమణి, చినవెంకన్న, చంద్రశేఖర్, వేదశ్రీ, శ్రీను, ఆనంద్‌కుమార్, నాగమణి, వీరబాబు, వజ్రమ్మ, లలిత తదితరులు పాల్గొన్నారు.

### వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి



ప్రశంసా పత్రం అందుకుంటున్న విష్ణు

హాలియా : వ్యాసరచన పోటీల్లో హాలియాకు చెందిన ఎస్ విష్ణుకు జిల్లాస్థాయి ప్రథమ బహుమతి లభించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ‘మాదక ద్రవ్య వ్యసనం-అదుపు, నిర్మూలన’ అనే అంశంపై జిల్లా వ్యాప్తంగా వ్యాసరచన పోటీలను జిల్లా పోలీసు శాఖ నిర్వహించింది. ఈపోటీల్లో హాలియా పబ్లిక్ స్కూల్ పూర్వ విద్యార్థి ఎస్ విష్ణుకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందన దీప్తిలు విష్ణుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

### పీఆర్‌టీయూ టీఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్

హాలియా : పీఆర్‌టీయూ టీఎస్ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం హాలియా పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడంతో పాటు వినూత్నమైన రీతిలో బోధన చేస్తూ ఉపాధ్యాయులు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ అనుముల మండల ప్రధాన కార్యదర్శి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సైదులు రావు, గౌతమ్, రవీందర్, నాయకులు దుర్గా ప్రసాద్, దేవేందర్, హరివర్ధన్, శ్రీకళా రాంమూర్తి పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ఏటీడీఓ లక్ష్మారెడ్డి

పెద్దవూర : ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వ మెనూను పాటిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా సహాయ గిరిజన అభివృద్ధి అధికారి (ఏటీడీఓ) కడారు లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, ఎస్టీ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, హాస్టల్ వర్కర్లకు సంబంధించిన హాజరుపట్టిక, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. పదోతరగతి విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశానుసారం పక్కాగా వందరోజుల ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ గిరిజన వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలని సూచించారు. అనంతరం హాస్టల్ ఆవరణలో మొక్కను నాటారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం బాలోజీ, వార్డెన్లు కొల్లు బాలకృష్ణ ఉన్నారు.

## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : అగి ఉన్న కార్లల్లో విలువైన వస్తువులను చోరీ చేసే అంతరాష్ట్ర దొంగను మండలంలని గూడూరు ఎక్స్‌రోడ్డు వద్ద శనివారం మిర్యాలగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలో 2023 సెప్టెంబరు 13న మిర్యాలగూడలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఒక వ్యక్తి రిజిస్ట్రేషన్ ముగించుకొని కారులో వెళ్తూ క్రాంతి హోటల్ వద్ద పార్కు చేసి భోజనం కోసం వెళ్లాడు. ఇది గమనించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నెల్లూరు జిల్లా కప్పురాళ్ల తిప్ప గ్రామానికి చెంది తుపాకుల హనూక్‌కుమార్ అనే వ్యక్తి కారు అద్దాలను పగుల కొట్టి కారులో ఉన్న రూ.4.74లక్షలు చోరీ చేశాడు. దీంతో బాధితుడు వాడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ దోరేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో అద్దంకి-నార్కట్‌పల్లి రోడ్డు గూడురు ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి మోటారు సైకిల్‌పై వస్తుండగా అనుమానంతో పట్టుకునే ప్రయత్నం చేస్తుండగా పరారయ్యాడు. దీంతో అతడిని వెంబడించి పట్టుకొని విచారించారు. దీంతో చేసిన నేరాన్ని ఒప్పుకున్నాడు. అదే విధంగా మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో మోటారు సైకిల్‌ను దొంగలించుకొని తన గ్రామమైన కప్పరాల తిప్పకు వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడని ఎస్ఐ తెలిపారు. దీంతో నిందితుడిని మిర్యాలగూడ కోర్టులో హాజరుపరచారు. ఇతడిని పోలీస్ కస్టడికి తీసుకోని ఇతర కేసుల్లో ఉన్నాడా అనే అంశంపై విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

## టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రం ఆవిష్కరణ



టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్న చెకుమురకి టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని శనివారం నిడమనూరు ఎంఈఓ బాలునాయక్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు టాలెంట్‌టెస్ట్ లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ టాలెంట్ టెస్ట్ ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. ప్రతీ విద్యార్థి ఈ టాలెంట్ టెస్ట్‌ల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బక్క శ్రీనివాసచారి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రాంపాటి అమరయ్య, యూటీఎఫ్ నాయకులు మదుసూదన్ పాల్గొన్నారు.

## కోదండరాంకు ఎమ్మెల్సీ ఇవ్వడం హర్షణీయం



మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారధి, తెలంగాణ జేఏసీ చైర్మన్ కోదండరాంను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ కేటాయించడం హర్షణీయమని మిర్యాలగూడ తెలంగాణ జేఏసీ నాయకులు మారం శ్రీనివాస్, మాలోతు దశరధనాయక్, మాడుగుల శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులో తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనేందుకు కోదండరాం ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యమకారులను గుర్తించి కోదండరాంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడాన్ని చూస్తుంటే తెలంగాణ ఉద్యమకారులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు.ఈ సమావేశంలో నాయకులు రావిరాల అంజయ్య, అరుణ, పరమేష్, నారాయణరెడ్డి, వీటి, మనోజ్, హాఫీజ్, శ్రీను, శర్మ, నాగయ్య, అస్లాం, జయరాజు, మారయ్య, సీతారాములు, వెంకట్ పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

హాలియా : పట్టణంలో ఆకాంక్ష పాఠశాల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, వివిధ శాఖల అధికారులుగా వ్యవహరించారు. అనంతరం విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోదాల రవీందర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్ కరీం, నూకల సతీష్, రాజు, చంద్రశేఖర్, నరేష్, కార్తీక్, మధు, మురళి, మంజుల, రజియా పాల్గొన్నారు.

## రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి



మిల్లులో ధాన్యం వివరాలను అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ ప్రమీలా

త్రిపురారం : ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని త్రిపురారం తహసీల్దార్ గాజుల ప్రమీలా అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామల్లో రేషన్ దుఖాణాలు, త్రిపురారం, సత్యనారాయణపురం గ్రామాల్లోని రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో ధాన్యం నిలవ్లపై ఆరా తీసీ, రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రేషన్ దుకాణాల నిర్వాహకులు తుకాలు సక్రమంగా పాటించాలని, సమయపాలన ఉండాలని ఆదేశించారు. రైస్ మిల్లుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటుగా కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.